'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

# నిశ్శబ్ద ఘోష


-యల్లాప్రగడ సువర్చలాదేవి

"ఇక్కడ విశ్వనాథంగారని... ఆయన సీటు ఎక్కడో కొంచెం చెప్తావా బాబూ" ఎలాగైనా వచ్చిన పని అవ్వాలని చాలా నిదానంగా నమ్రతగా అడిగాడు ముకుందరావు.

"ఆ చివరి వరుసలో కిటికీ పక్క సీటు" ఏ కళనున్నాడో ఏదీ నాన్చకుండా త్వరగా సమాధానం ఇచ్చేశాడు ఆ యంగ్ ప్యూన్.

"ఎక్స్‌క్యూజ్‌మీ... విశ్వనాథంగారి సీటు ఇదేనా!?" ప్రశ్న పూర్తికాకుండానే "పక్క సెక్షన్‌కి వెళ్ళినట్టున్నారు. కూర్చోండి"అంటూ తన ఫైలులో తల దూర్చేశాడు సదరు పక్క సీటు ఉద్యోగి.

తన పని అవుతుందో లేక మళ్ళీ ఎన్నిసార్లు తిరగాలో అనుకుంటూ మనసులోనే దేవుడిని తలుచుకుంటూ కుదురుగా కుర్చీలో కూర్చొని నిముషాలు లెక్కించ సాగాడు ముకుందరావు.



"ఎస్... చెప్పండి" అన్న ఖంగుమన్న కంఠం విని ఉలిక్కిపడి తనను పలకరించిన ముఖంవైపు చూశాడు. ఎక్కడో చూసిన ముఖం ముఖ్యంగా ఆ కంఠం సుపరిచితమైనదిగా తోస్తోంది. ఇతను కనుక తనకు తెలిసిన వాడైతే తన పని మరింత సులువవుతుందని మనసులో ఏదో మూల ఓ చిన్న ఆశ. తను అతనివైపు చూడటంతో అటునుండి కూడా ఓ సంచలనం. సందేహం లేదు. ఇతను తనకు తెలిసిన ఆమాటకొస్తే ఒకనాటి తన స్నేహితుడు విశ్వనాథమే.

"మీరు... నువ్వు విశ్వ..." ముగించేలోగానే "ముకుందం.... ఎన్నాళ్ళు కాదు, కాదు... ఎన్నేళ్ళైంది" చేతులు పట్టుకొని ఊపేశాడు విశ్వనాథం. ఒక్కసారి చుట్టుపక్కలవాళ్ళు వీళ్ళవైపు ఆశ్చర్యంగా చూసి వాళ్ళ ఫైళ్ళల్లో తలలు దూర్చారు.

"నా ఓల్డ్ ఫ్రెండోయ్... చాలా కాలం తర్వాత కలిశాము" అడక్కపోయినా పక్క సీటు వాడికి చెప్పి "పదవోయ్, ముకుందం, అలా క్యాంటిన్‌లో కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం" అన్నాడు బయటకు దారితీస్తూ.

* * *

"సో, ఇంకో ఆర్నెల్లల్లో రిటైర్ అవబోతున్నావన్న మాట. బాగుందోయ్. నీ పెన్షన్‌కేం ఢోకాలేదు. నేను చూసుకుంటాలే రిటైర్ అయిన తర్వాత మొదటి నెలనుండి నువ్వు నీ పెన్షన్‌ని తీసుకొనే పూచీ నాది. ఇక దాని సంగతి మర్చిపో. ఇక మీ ఫామిలీ సంగతేంటి చెప్పు. చెల్లెమ్మ, పిల్లలు అందరూ బాగున్నారా?... అన్నట్లు పిల్లలు ఇప్పుడేం చేస్తున్నారు?"

"నువ్వు కొంచెం గ్యాపిస్తే అన్నీ చెప్తాను. అసలు నువ్వింకా ఏమీ మారలేదు. ఇన్నేళ్ళైనా అదే హుషారు. అదే ఉత్సాహం". "మరేం చెయ్యమంటావ్!? పాత స్నేహితుడివి. పైగా చాలా సంవత్సరాలకి కనపడ్డావ్! మాటలు ఆగమంటే ఎలా ఆగుతయ్యి?! విశ్వనాథం గొంతులో స్నేహితుని పట్ల అభిమానం.

"ఏముంది, అనకాపల్లిలోని మా పాత ఇల్లు అమ్మేసి, వైజాగ్‌లోనే ఓ చిన్న స్థలం కొన్నాం. రేపు రిటైర్ అయ్యాక వచ్చే డబ్బులు, ఇన్నాళ్ళు దాచిన దాంట్లో కొంత. అలాగే పిల్లలుకూడా కొంత సర్దుతామన్నారు. ఏదో ఆ స్థలంలోనే ఓ ఇల్లుకట్టి అక్కడే సెటిలవుదామనుకుంటున్నాను. చెప్తున్నాడు ముకుందం.

"బాగుందోయ్! అంటే పిల్లలు కూడా సెటిల్ అయ్యారన్నమాట" ఉత్సాహంగా అడిగాడు విశ్వనాథం.

"నా స్నేహితుడొకడికిది ఓ సూపర్ మార్కెట్ ఉంది. పెద్దాడు అందులోనే చేస్తున్నాడు. చిన్నోడు మెడికల్ రిప్రజెంటేటివ్. వాడి ఆఫీసు వైజాగ్‌లోనే. అమ్మాయినేమో ఓ లెక్చరర్‌కి ఇచ్చాం. ఆయన వైజాగ్‌లోనే ఓ పెద్ద కాలేజీలో చేస్తున్నాడు". మామూలుగా చెప్తున్న ముకుందం మాటలకి అడ్డొస్తూ...

"అదేంటోయ్ పిల్లల్ని ఏ సాఫ్ట్‌వేర్ వైపో దింపకపోయారా? ఇంకా ఈ కాలంలో ఇక్కడేం ఫ్యూచర్ ఉందని? నా కొడుకు, కూతురు ఇద్దరూ స్టేట్స్‌లోనే ఉన్నారు. కోడలు, అల్లుడు అందరూ ఉద్యోగస్తులే, మావాడు త్వరలో ఓ ఇల్లు కూడా కొంటానంటున్నాడు" చాలా కాజ్యువల్‌గా చెప్పుకుపోసాగాడు విశ్వనాథం.

"చూడు ముకుందం. నువ్వు స్నేహితుడివి కాబట్టి మనసు విప్పి చెప్తున్నా. పిల్లల్ని చదివించే టైమ్‌లో బాగా చదివిస్తే ఆ తర్వాత వాళ్ళ లైఫ్ అంతా పూలపాన్పే."

"నీ సంగతి చూడు రిటైర్ అవుతున్నా నువ్వే ఓ ఇల్లు కట్టలేకపోతావ్. అదే ఈ కాలం జనరేషన్ చూడు. ఉద్యోగం కోసం పరాయి దేశం వెళ్ళి అక్కడే ఇల్లు కట్టుకొని సెటిల్ అయ్యేంత ఫాస్ట్‌గా ఉన్నారు."

చిన్నతనంగా అనిపించిందో ఏమో ముకుందం ముఖం చిన్నబోయింది. మొదటినుండి విశ్వనాథం తీరే అంత. ఏదొచ్చినా ఆపలేం. ఆయనతో అంత త్వరగా ఎవరికీ కుదిరేది కాదు. ముకుందం మొదటినుండి నెమ్మదస్థుడు. అందుకే ఇద్దరికీ స్నేహం కుదిరింది. దాదాపు ఇరవై ఏళ్ళ క్రిందట ఇద్దరూ కలిసి విజయవాడలో పనిచేశారు. దాదాపు నాలుగేళ్ళు కలిసి ఉన్నారు. ఆ తర్వాత ఉద్యోగం నిమిత్తం బదిలీలై చెరొక చోటికి చేరారు. మధ్యమధ్యలో ఏ స్నేహితుల ఇంట్లో శుభకార్యాలకి అప్పుడప్పుడు కలిసేవారు. గత పదేళ్ళుగా అదీ లేదు.

తనే తేరుకొని మామూలుగా అన్నాడు "ఏదో దైవ నిర్ణయం ఇలా జరిగింది. నాకూ పెద్దగా ఆశలేం లేవు. ఏదో నేను ఉన్నన్నాళ్ళూ పిల్లలందరూ నా కళ్ళముందు కనబడుతూ ఉంటే నాకంతే చాలనుకున్నాను. మీ చెల్లెలు కూడా చిన్నప్పట్నుంచీ పిల్లలని వదిలి ఉండేది కాదు. పిల్లలుకూడా మాకు బాగా అలవాటయిపోయారు. మేము మిమ్మల్ని వదిలి ఉండలేం. అంటుంటారు ఏదో అలా అయిపోయిందిలే" అన్నాడు తేలిక చెయ్యటానికి ప్రయత్నిస్తూ.

"సరేలే. మా ఇంటికి రావాలి నువ్వోరోజు. మొన్ననే మావాడు ఇక్కడో ఫ్లాటు తీసుకోమంటే తీసుకున్నాం. గృహప్రవేశం కూడా గ్రాండ్‌గా చేశాం. ఆ వీడియో క్యాసెట్టు కూడా మొన్న వాడి ఫ్రెండ్స్ ఎవరో స్టేట్స్ వెడుతుంటే ఇచ్చి పంపాము" గొప్పగా చెప్పుకుపోతున్నాడు విశ్వనాథం.

"చాలా సంతోషంగా మీ పిల్లలందరూ మంచి పొజిషన్‌లో ఉన్నారు. మీరు కూడా ఎప్పుడైనా స్టేట్స్ వెళ్ళకపోయారా? "వెళ్తాం. నేనూ ఇంకో రెండు నెలల్లో రిటైర్ అవుతాను. ఇక ఆ తర్వాత కూడా ఇక్కడుంటే వాళ్ళు ఒప్పుకోరు" మురిసిపోతూ చెప్పాడు విశ్వనాథం.

* * *

కాలచక్రంలో రెండేళ్ళు గిర్రున తిరిగిపోయాయి. ముకుందం, విశ్వనాథం ఇద్దరూ రిటైరయ్యారు. విశ్వనాథం అన్నమాట నిలబెట్టుకున్నాడు. ముకుందం పెన్షను, ఇతరత్రా పనులన్నీ సులువుగానే అయ్యాయి. ముకుందం ఇల్లు పూర్తిఅయి గృహప్రవేశం కూడా అయ్యాడు. కొడుకు, కోడళ్ళు, మనుమలు, మనుమరాండ్రతో ముకుందం ఇల్లు ఎప్పుడూ పండుగ వాతావరణాన్ని తలపించేస్తూ ఉంటుంది.

కూతురు వాళ్ళు ఉండేది కూడా అక్కడేగనక తరచూ వచ్చి వెళ్ళడం, పండుగలు, పబ్బాలు కలిసి సరదాగా చేసుకోవడం ఆదివారాలు సెలవురోజులలో అందరూ కలిసి

ఏ రామకృష్ణా బీచ్‌కో, కైలాసగిరికో, సింహాచలానికో ఇలా ఒక్కోసారి ఒక్కో ప్రదేశానికి వెళ్ళిరావడం, ఏదైనా రెండు మూడురోజులు సెలవలు వస్తే చుట్టుపక్కల అన్నవరం, అరసవిల్లి, ఇలా అటు పుణ్యక్షేత్రాలు. ఇటు వినోదంగా పిక్నిక్‌లకి వాటికి వెళుతూ సరదాగా గడిపేవారు. కోడళ్ళని కూతుళ్ళల్లాగా చూసుకొంటూ, మనవలకి, మనవరాండ్రకి చదువుచెపుతూ, కథలుచెప్తూ ఇంట్లో ఎలాంటి గొడవలు లేకుండా చేసుకొని రిటైర్మెంట్ జీవితాన్ని సాఫీగా గడపసాగారు ముకుందం దంపతులు.

తన మరో స్నేహితుని కూతురి పెళ్ళి సందర్భంలో హైద్రాబాదు వచ్చారు ముకుందం దంపతులు. తనకు సహాయం చేసిన విశ్వనాథాన్ని చూసి యోగక్షేమాలు కనుక్కుందామని విశ్వనాథం ఇంటికి వెళ్ళాడు ముకుందం.

దాదాపు మూడేళ్ళవటంతో విశ్వనాథం ఉంటున్న ఫ్లాటు పట్టుకోవడం కొంచెం కష్టమయ్యింది. ముకుందానికి విశ్వనాథం ఉండే అపార్ట్‌మెంట్ చుట్టుపక్కలన్నీ అపార్ట్‌మెంట్లు వెలిశాయి. విశ్వనాథం ఉండే అపార్ట్‌మెంట్‌కి వెళ్ళే దారికూడా బాగా ఇరుకైంది. ఫ్లాటు సరిగా గుర్తులేకపోవడంతో అక్కడి వాచ్‌మెన్‌ని అడిగాడు. ఆ వాచ్‌మన్ హిందీ తెలుగు, ఉర్దూ అన్నీ కలిపేస్తూ చాలా నిర్లక్ష్యంగా అలాంటి వాళ్ళెవరూ లేరని చెప్పాడు. అయినా శాంతంగా "ఆయన పిల్లలు అమెరికాలో ఉంటున్నారు ఇక్కడ ఆయన, ఆయన భార్య మాత్రమే ఉంటారు" అంటూ ఏవో క్లూ ఇస్తున్నట్లు మాట్లాడబోయాడు. ఆయన మాటలు పూర్తికావొచ్చేలోపునే గయ్యిమంటూ "ఈడ ఉండే వాళ్ళందరూ గసవంటోళ్లే, పోరగాల్లు ఆ అమెరికాలో, గీ పెద్దోళ్ళు ఇక్కడ" అదో పెద్ద క్లూనా!" అన్నట్టు మరోసారి నిర్లక్ష్యంగా చెప్పాడు. మొత్తానికి వాడికేదో నచ్చచెప్పి ఓ రెండు మూడు ఫ్లాట్ల కాలింగ్‌బెల్స్ నొక్కి చివరికి విశ్వనాథం ఫ్లాటు పట్టుకున్నాడు ముకుందం. అయితే తను చూస్తున్నది విశ్వనాథాన్నేనా అని కాసేపు ఆశ్చర్యపోయాడు విశ్వనాథాన్ని చూసి. కాస్త పెద్దవాడైనట్టు కనపడుతున్నాడు. గతంలో హుషారు లేదు. నీరసంగా నిస్తేజంగా ఉన్నాడు. వచ్చిన విషయం ఆ మాట, ఈమాట తర్వాత తన సందేహాన్ని బయటపెట్టాడు ముకుందం, నీరసంగా చెప్పసాగాడు విశ్వనాథం.

రిటైర్ అయ్యాక సతీసమేతంగా అమెరికా వెళ్ళాడు విశ్వనాథం. కొడుకు కట్టిన ఇల్లు, ఫర్నిచరు చూసి ఉబ్బితబ్బిబ్బయ్యాడు. మొదట్లో బాగానే సాగింది. కానీ రానురాను ఏమీ తోచేదికాదు. చాలా కాలంనుండి అక్కడే ఉన్న వాళ్ళకి అక్కడి ఆహార అలవాట్లకి అలవాటుపడి పార్వతమ్మ వంటలు వాళ్ళ పిల్లలకే రుచించటంలేదు. నూనె కొంచెం ఎక్కువైతే, కొలెస్ట్రాల్ అని, తినే ప్రతి దానిమీద కేలరీస్ ఎక్కువ ఉన్నాయని చేసిన ప్రతి దానికి ఏదో వంకతో పార్వతమ్మ వంట వారిద్దరికే పరిమితమయ్యేది. మరోపక్క తెల్లవారి ఆరకముందే కొడుకు, కోడలు, మనవలు ఉద్యోగాలు చదువుల నిమిత్తం బయటుకు వెళ్ళేవారు. ఇక అవన్నీ ముగించుకొని హెల్త్ క్లబ్బులు, ఎంటర్‌టైన్‌మెంట్లు అన్నీ అయి ఏ రాత్రికో ఇంటికి చేరే వారు. అదే దాదాపు తిండి కూడా బయటే తినొచ్చి, తండ్రికి బోర్ కొడుతుందేమోనని ఇండియన్ అసోసియేషన్స్ చాలానే ఉన్నాయి. ఏదో ఒకదాంట్లో ఇన్వాల్వ్ అవ్వమని, ఏదో ఒక వ్యాపకం పెట్టుకోమని ఉచిత సలహా ఒకటి పడేసి తన పనులతో బిజీ అయ్యాడు కొడుకు. ఇక కూతురుని చూడ్డానికి కొంత కాలం అక్కడ ఉన్నారు విశ్వనాథం దంపతులు. పాపం తల్లిదండ్రులకి ఇంట్లో బోర్ అని ఎలాగో కొన్ని తెలుగు సినిమా క్యాసెట్లు తెచ్చి పడేసింది కూతురు. ఓ రెండుమూడు క్యాసెట్లు చూశాక వాటిపైన విరక్తి వచ్చింది.

పోనీ మనుమలు, మనమరాండ్రతో గడుపుదామంటే వాళ్ళేమో వీళ్ళని పరాయి వాళ్ళలాగ చూసేవాళ్ళు తప్ప దగ్గర కాలేకపోయినారు. ఎలాగో చొరవ చేసి తనకు తెలిసిన కథలు పురాణాలు లాంటివి చెప్పి పిల్లలకు దగ్గరవ్వాలన్న తన ఆలోచనలని కూతురు పడనీయలేదు. "ప్రపంచం ఎంతో మారిపోయింది. వాళ్ళు ఇప్పటినుండీ ఎంతో చదువుకోవాలి. నేర్చుకోవాలి. వాళ్ళకి ఇలాంటి పనికిరాని కథలంటూ టైము వేస్ట్‌చెయ్యొద్దంటూ తమకే నీతులు చెప్పారు. కొద్దికాలానికే తిరిగి ఇండియా వచ్చేశారు.



"కొన్నాళ్ళు చెల్లెమ్మను తీసుకొని అలా నాలుగు ఊళ్ళు తిరుగు. పుణ్యక్షేత్రాలు చూసినట్లు ఉంటుంది. పుణ్యం, పురుషార్థం అలాగే నువ్వు చెల్లెమ్మని తీసుకొని కొంత కాలం మా ఇంటికి వచ్చి ఉండాల్సిందే. ఇక నువ్వేం చెప్పినా నేను వినను" చనువుగా అన్నాడు ముకుందం.

"అప్పటినుండి ఏదో ఇలాగే కాలం గడిపేస్తున్నాం. వస్తాం, వస్తాం అంటారు గాని మూడేళ్ళు గడిచిపోయాయి. వాళ్ళు రాలేదు. మేము మళ్ళీ వెళ్ళలేకపోయాం. మొదట్లో పాత స్నేహితుల్ని కలవడం, లైబ్రరీకి వెళ్ళటం, ఉదయాన్న టాంక్‌బండ్‌పై మార్నింగ్ వాక్, సాయంత్రాలు ఏ రవీంద్రభారతికో, త్యాగరాయ గానసభకో ఇలా ఏవో సభలు, సమావేశాలతో కాలక్షేపం చేసేవాడిని. మీ చెల్లెలు కూడా ఈ దగ్గర్లోని గుళ్ళకి వెళ్ళడం చుట్టుపక్కల వాళ్ళతో కబుర్లు, ఆ టీవీలలోని సీరియల్స్‌తో కాలక్షేపం చేసేది. కాని ఎంత కాలమని వీటితోనే సాగుతుంది చెప్పు. ఇలాంటివన్నీ ఎన్నున్నా మనవాళ్ళు అనే వాళ్ళు దగ్గర్లో ఉంటే ఆ ఆనందమే వేరుకదా! మీ చెల్లెలు మరీను. వాళ్ళమీద బెంగతో ఈ మధ్య దాని ఆరోగ్యం కూడా పాడుచేసుకుంది. అదిగో ఆ రూములో పడుకొని ఉంది చూడు."

సున్నిత మనస్కుడైన ముకుందానికి ఆ దృశ్యం మరింతగా బాధపెట్టింది.

"కొన్నాళ్ళు చెల్లెమ్మను తీసుకొని అలా నాలుగు ఊళ్ళు తిరుగు. పుణ్యక్షేత్రాలు చూసినట్లు ఉంటుంది. పుణ్యం, పురుషార్థం అలాగే నువ్వు చెల్లెమ్మని తీసుకొని కొంత కాలం మా ఇంటికి వచ్చి ఉండాల్సిందే. ఇక నువ్వేం చెప్పినా నేను వినను" చనువుగా అన్నాడు ముకుందం.

ముకుందం దంపతులకి కనీసం టీ అయినా ఇవ్వాలని లేని ఓపిక తెచ్చుకొని లేవబోయింది పార్వతమ్మ.

"లేదులే ఒదినా, నువ్వు తిరిగి ఆరోగ్యం తెచ్చుకొని పుంజుకొని మామూలు మనిషివైతే మేం వచ్చి నీ చేతి వంట కూడా రుచి చూస్తాం. ఈసారికి నన్ను చేయని"అంటూ తనే చొరవ చేసుకొని వంటింట్లోకి వెళ్ళి టీ పెట్టి నలుగురికి తెచ్చింది ముకుందం భార్య వర్ధనమ్మ.

మీరు తప్పకుండా మా ఇంటికి రావాల్సిందేనని మరీ మరీ చెప్పి విశ్వనాథం దంపతులతో సరే అనిపించుకొని కదిలారు ముకుందం దంపతులు.

చాలారోజుల తర్వాత సొంత మనుషులనెవరినో కలిసినట్లుంది వాళ్ళకి. అదే వాళ్ళకి కొత్త బలాన్ని ఇచ్చినట్లు ఉంది.

త్వరలో ఇద్దరూ కలిసి తిరుపతి వెంకటేశ్వరుని దర్శించుకొని అటునుండి వైజాగ్ వెళ్ళారు. ముందు వైజాగ్‌లో ఓ హోటల్‌లో దిగి ఆ తర్వాత అక్కడినుండి ఫోను చేశాడు విశ్వనాథం. కొద్దిసేపట్లోనే భార్య కొడుకుతో కలిసి వచ్చాడు ముకుందం.

"ఒక్క ముక్క చెప్తే స్టేషనుకు వచ్చేవాడిని కదా?"

"ఎలా ఉన్నావ్ వదినా? కాస్త కళ వచ్చింది మొహంలో"

"అంకుల్ ఈ సామాను కార్లో పెట్టిస్తున్నాను."

"ఆ మర్చాను... వీడు మా రెండోవాడురా" ముకుందం పరిచయం.

"నమస్తే, అంకుల్" "గాడ్ బ్లెస్ యూ"

"అయినా, ఇప్పుడు సామాను మార్చటం ఇవన్నీ ఎంట్రా?"

కాస్త ఆశ్చర్యం, ఏం జరుగుతుందో అర్థంకాని తికమకతో అడిగాడు విశ్వనాథం.

"నువ్వేం. కంగారు పడకు. నువ్వు చెల్లెమ్మ జాగ్రత్తగా వచ్చి కార్లో కూర్చోండి. హోటల్ వాడితో మావాడు మాట్లాడి వస్తాడు. ఇప్పుడు మనందరం మనింటికి వెళుతున్నాం. మీరూ మాతోపాటు అక్కడే ఉంటారు. ఇంక నువ్వేమీ మాట్లాడకు" చాలా సాధారణంగా చెప్పాడు ముకుందం.

కాసేపట్లో ముకుందం కొడుకు హోటల్ వ్యవహారం తేల్చేసి, సామాను కారు డిక్కీలో పెట్టించేసి వచ్చి కారు స్టార్ట్ చేశాడు.

ముకుందం మిగతా కుటుంబ సభ్యులందరూ ఘనంగా, మనస్ఫూర్తిగా స్వాగతించారు విశ్వనాథం దంపతులని.

"మీరు సహాయం చెయ్యబట్టే నాన్నగారి పెన్షన్ పనులన్నీ త్వరగా అయ్యాయి" సాయంత్రం టీ తాగే టైములో అన్నాడు ముకుందం పెద్దబ్బాయి సారధి కృతజ్ఞతతో.

"ఏదో నాకు చాతనైన సాయం చేశాను" సంతోషంగానే అన్నాడు విశ్వనాథం.

ముకుందం కోడళ్ళు కూడా ఎంతో ఆప్యాయంగా మాట్లాడటం కొసరి కొసరి మరీ తినిపించటం చూడముచ్చటేసింది విశ్వనాథం దంపతులకి.

"మీరేం చేస్తుంటారు అమ్మాయ్?" చనువుగా అడిగాడు విశ్వనాథం.

"అక్క మొత్తం హోం మానేజ్‌మెంట్, నేను ఈ దగ్గర్లోనే కాన్వెంటులో టీచర్‌గా చేస్తున్నాను. మా ఇంట్లో పిల్లలందరి చదువుబాధ్యత నా అదనపు బాధ్యత" నవ్వుతూ చెప్పింది చిన్న కోడలు.

"మొత్తం పనంతా వాళ్ళే చేస్తుంటారు. నన్నసలు ఏ పని చెయ్యనీయరు" మురిసిపోతూ చెప్పింది వర్ధనమ్మ.

"అంతా వట్టిదే, ఆంటీ. మా అత్తమ్మ పోపుపెట్టకుండా వంట అవుతుందేమో అడగండి" పెద్దకోడలు నవ్వుతూ చాడీ చెప్తున్నట్టు అంది.

"అన్నం అంతా మీరు వడ్డిస్తే, చివర్లో నెయ్యి వడ్డించినట్లు నేను చేస్తోంది ఏముంది?" వర్ధనమ్మ కూడా కోడళ్ళతో సమానంగా చతురోక్తులు విసురుతూ ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం ఉంది.

"తాతయ్య, తాతయ్యా మీకు కథలు వచ్చా?" మాకు చెప్తారా?" తాతయ్య నాకు మా క్లాసులో డ్రాయింగ్‌లో ఫస్ట్ వచ్చింది. ఇదిగో నేనే వేసిన పెయింటింగ్" మనవళ్ళు, మనవరాళ్ళతో ఉక్కిరి బిక్కిరి అయినారు. ఒక్క క్షణం తాము వచ్చింది తన కొడుకింటికా లేక చుట్టాలింటికా!? తమలోతామే ఆశ్చర్యపోయారు.

(మిగతా 12వ పేజీలో)

వారంరోజులు ఎలా గడిచిపోయాయో కూడా తెలీలేదు విశ్వనాథం వాళ్ళకి. విశ్వనాథం తిరిగి పాతమనిషి అయ్యాడు. బాగా హుషారుగా ఉన్నాడు. పార్వతమ్మ కూడా బాగా ఆరోగ్యంగా కనపడుతోంది. ఓరోజు సాయంత్రం "ఇక మేము హైద్రాబాదు వెళతాంరా! ఇల్లొదిలి వచ్చి పది రోజులు దాటుతోంది" అన్నాడు విశ్వనాథం. ఒక్కసారిగా ఏదో కోల్పోతున్న బాధ. విశ్వనాథంలోను, పార్వతమ్మలోను స్పష్టంగా కనబడుతోంది.

"ఇంటికేం ఫరవాలేదు. నీకంత అనుమానమైతే మా చిన్నోడు త్వరలోనే హైదరాబాదు వెళ్తున్నాడు. వాడి ఆఫీసు పనిమీద ఇంటికి వెళ్ళి అన్నీ చూసి వస్తాడు. నీకే ఫర్లేదు" నచ్చచెప్పబోయేడు ముకుందం.



***తన పిల్లల్ని విద్యావంతులుగా చెయ్యిగలిగానని గర్వపడ్డాడు. ఈ ప్రపంచం మారిపోయిందని, ఈ ప్రపంచమే ఒక గ్లోబల్ విలేజ్‌గా మారిందని అందులో ఈ ఆప్యాయతలు, అభిమానాలు అంటూ కూర్చుంటే ముందుకు వెళ్ళలేం అని అనుకున్నాడు. కానీ ఇప్పుడు తను ఇవే అభిమానాలు, ఆప్యాయతలకు బందీ అయినాడు. మారింది తనా, ప్రపంచమా?***

"ఈసారికి నా మాట విను. మళ్ళీ వస్తాం కదా! మీరు కూడా ఓసారి ఇంటిల్లిపాదీ రండి."

"ఇప్పుడు హైద్రాబాద్ కూడా ఓల్డ్ సిటీ కాదు. అక్కడా చూడటానికి చాలా ఉన్నాయ్. సరదాగా చెప్పడానికి ప్రయత్నించాడు కానీ ఆయన వల్లకాలేదు.

అందరి బలవంతంమీద మరో రెండురోజులు అక్కడే ఉండిపోయారు విశ్వనాథం దంపతులు.

* * *

రెండ్రోజుల తర్వాత సాయంత్రం వైజాగ్ రైల్వేస్టేషను. గోదావరి ఎక్స్‌ప్రెస్ జనాలతో రద్దీగా ఉంది. ముందుగానే రిజర్వేషను చేయించటంవలన తమ సామాన్లు సర్దుకొని కూర్చున్నారు విశ్వనాథం దంపతులు. ముకుందం కుటుంబం మొత్తం వచ్చారు స్టేషనుకు. రాత్రికి తినటానికి పూరీ, కూర పులిహోర, పెరుగన్నం అన్నీ కట్టి ఇచ్చారు వర్దనమ్మ కోడళ్ళు. మినరల్ వాటర్ బాటిల్‌తో పెద్దాడు, అరటి పళ్ళతో చిన్నోడు హడావుడిగా తిరుగుతున్నారు. వాళ్ళు సామానంతటిని జాగ్రత్తగా సర్ది తమవంతు చేస్తున్నారు.

"ఇదిగోరా నీకిష్టమైన రచయిత పుస్తకం" స్నేహితుడికి ముకుందం చిన్న కానుక. అంతకుముందే ఇంటి దగ్గర ఎంతవద్దన్నా వినకుండా విశ్వనాథం దంపతులకు బట్టలుపెట్టి చిన్నవాళ్ళందరు అక్షింతలు వేయించుకొని ఆశీర్వచనం తీసుకున్నారు.

ముకుందం కుటుంబం చూపించిన ఆదరాభిమానాలకు ఎలా కృతజ్ఞత చెప్పాలో కూడా అర్థంకాలేదు. "ఎందుకురా ఇవన్నీ" విశ్వనాథం గొంతులో దుఃఖం స్పష్టంగా తెలుస్తోంది ముకుందానికి.

"ఇందులో ఏముందిరా? జీవితంలో ఏవీ శాశ్వతంకాదు. ఉన్న కొన్ని రోజులైనా అంతా కలిసి ఆనందంగా ఉండగలిగితే అంతకన్నా ఆనందమేముంటుంది?"

"మేమెవరమూ మిమ్మల్ని పరాయివాళ్ళ లాగా అనుకోవడంలేదు. మిమ్మల్ని మా కుటుంబ సభ్యులుగానే భావించాము. మీరుకూడా అలా భావిస్తే ఇంకేం మాట్లాడవద్దు" విశ్వనాథం మనసులోని భావాన్ని కనిపెట్టిన ముకుందం సున్నితంగా అన్నాడు.

విశ్వనాథానికి మరిక మాటలు రాలేదు. వెళ్ళబోయేముందు ఒకసారి స్నేహితుడిని కౌగిలించుకున్నాడు. స్నేహితునికి షేక్ హాండ్ ఇస్తూ చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. మౌనంగా ఉన్నా అతని మనసులోని భావాలన్నీ స్పష్టంగా తెలుస్తున్నయి. భారమైన మనసుతో ముకుందం కుటుంబానికి వీడ్కోలు చెప్పారు విశ్వనాథం దంపతులు. రైలు కదిలింది. కొద్దిసేపట్లోనే రైలు వేగం పుంజుకుంది.

వేగంగా వెనక్కుపోతున్నట్టు కన్పిస్తున్న చెట్లను పరిసరాలను నిశ్చలంగా గమనిస్తున్నాడు విశ్వనాథం. ముకుందంతోటి గడిపిన రోజులు ఎంత ఆనందంగా ఉన్నయి. అన్నవరం, సింహాచలం, అరసవెల్లి పుణ్యక్షేత్రాలు, బీచ్‌లు పార్కులు, మ్యూజియం, ఇంటి పెరటిలోని పూలమొక్కలు, వాకిట్లో పడక్కుర్చీలో కూర్చుని చెప్పుకున్న కబుర్లు, చూసిన సినిమా ఆ వెన్నెల, ఆ చల్లగాలి, పిల్లలతో ఆడిన క్యారమ్స్, చెస్, ఆటలు, పిల్లల పాటలు ముచ్చట్లు మొత్తానికి నిముషం తీరికలేకుండా తమ కష్టాలు, బెంగలు మొత్తం మర్చిపోయి ఎంత హాయిగా గడిచిపోయింది.

ఒక్కసారి విశ్వనాథం మనసు వేగంగా వెనక్కు వెళ్ళింది. కొన్నేళ్ళు క్రితం ఇదే ముకుందం తనని కలిసినప్పుడు పిల్లల్ని సరిగా పెంచలేదని, వారికి సరైన భవిష్యత్తు ఇవ్వలేదని తను అన్నాడు. పిల్లలు, ప్రేమ, సెంటిమెంట్ ఇవన్నీ ఫూలిష్‌నెస్‌గా భావించాడు. తన పిల్లల్ని విద్యావంతులుగా చెయ్యిగలిగానని గర్వపడ్డాడు. ఈ ప్రపంచం మారిపోయిందని, ఈ ప్రపంచమే ఒక గ్లోబల్ విలేజ్‌గా మారిందని అందులో ఈ ఆప్యాయతలు, అభిమానాలు అంటూ కూర్చుంటే ముందుకు వెళ్ళలేం అని అనుకున్నాడు. కానీ ఇప్పుడు తను ఇవే అభిమానాలు, ఆప్యాయతలకు బందీ అయినాడు. మారింది తనా, ప్రపంచమా? తను ముకుందం ముందు గెలిచాడా? ఓడాడా? గతంలో తను అనుకున్నది తప్పా? ఒప్పా? ప్రస్తుతం తను చూసింది తప్పా? తప్పెవరిది? తప్పు ఎక్కడుంది? మనసులో ఎక్కడో ఒక చోట సమాధానం తెలుస్తున్నట్టుగా ఉంది. కానీ ఆ సమాధానాన్ని ఒప్పుకోవాలో, వద్దో అర్థంకాని తికమకలో ఉన్నాడు. బయట చీకటి పడింది. ఇప్పుడు బయటకి చూసినా, తన మనసులోకి చూసుకున్నా ఒకటే చీకటి. అంతా చీకటి.

★

## సమీక్ష




### బి.ఎస్. రాములు

50వ జన్మదిన స్వర్ణోత్సవ సంచిక

వెల: రూ.60/-

ప్రతులకు: సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం, విశాల సాహిత్య అకాడెమీ, 2-2-647/ఎ/57 సాయిబాబానగర్, శివం రోడ్, హైదరాబాద్ - 500 013

### ముకుందూరు



మూలరచన: బెళగెరె కృష్ణశాస్త్రి

అనువాదం: డాక్టర్ జోస్యుల సదానందం

వెల: రూ.40/-

ప్రతులకు: డాక్టర్ జె. సదానందం 6-4-129-1, మారుతీనగర్, అనంతపురం - 515 004



### జర్నలిజం


(పత్రికా రచన వృత్తి)

-ఎస్.వి.డి.వి. ప్రసాద రావు

వెల: రూ.100/-

ప్రతులకు: రచయిత, ఎఫ్-401, అపూర్వ రెసిడెన్సీ, ఎస్.ఆర్. నగర్, పటమటలంక, విజయవాడ - 520 010

### కెరటాలు




(కవితా సంకలనం)

-షహనాజ్ ఫాతిమా

వెల: రూ.30/-

ప్రతులకు: రచయిత, బి-59, ఎల్.ఎమ్.డి. కాలనీ, తిమ్మాపూర్ మండల్, కరీంనగర్ జిల్లా



### భీమన్నా (ద్విశతి)

పద్యకావ్యం

-అక్కిరాజు సుందర రామకృష్ణ

వెల: రూ. 50/-

ప్రతులకు: రచయిత, 1-8-702/1/1, ఆంధ్రాబ్యాంకు సందు, నల్లకుంట హైదరాబాద్